సాక్షి జోగుళాంబ గద్వాల

సోమవారం ၊ 20 ၊ మార్చి ၊ 2023



హైవే పనులు ప్రారంభం

మహబూబ్‌నగర్–చించోలి జాతీయ రహదారి పనులు ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸



రాష్ట్రంలో కుటుంబ పాలన

రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతోందని రాష్ట్ర ఇన్‌చార్జ్ గిరీష్ చోడాంకర్ విమర్శించారు.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.2 /19.4

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అప్పుడప్పుడు మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

భయం గుప్పిట్లో..

నిర్మానుష్యంగా మారిన చిన్నోనిపల్లి



చిన్నోనిపల్లె రిజర్వాయర్ పనులు జరిగే చోటుకు వెళుతున్న మహిళలను అడ్డుకున్న పోలీసులు

- గ్రామంతోపాటు రిజర్వాయర్ వద్ద భారీగా పోలీసుల మోహరింపు
- ఇరిగేషన్, రెవెన్యూ శాఖల పర్యవేక్షణలో ప్రారంభమైన పనులు
- తమవారి ఆచూకీ చెప్పాలని మహిళల ఆందోళన
- పనులు అడ్డుకునేందుకు ప్రయత్నం

గద్వాల రూరల్/ గట్టు:

'1.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించతలపెట్టిన రిజర్వాయర్ కింద ఒక్క ఎకరా ఆయకట్టు లేదు.. మమ్మల్ని ఊరు.. ఇళ్లు ఖాళీ చేయమంటే ఎట్లా. వ్యవసాయం తప్పా మాకేమీ తెల్వదు. రిజర్వాయర్ నిర్మించొద్దని.. న్యాయం చేయాలని మా ఊళ్లోని వారందరూ 423 రోజులు దీక్షలు చేపట్టారు. తమకు న్యాయం చేయాలని గ్రామ పంచాయతీ.. కలెక్టరేట్ నుంచి దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సైతం గళం వినిపించారు.. అయినా మా మొర ఆలకించలే. రాత్రికి రాత్రి పోలీసులు ఇళ్లల్లోకి వచ్చి గ్రామంలోని మగవారందరినీ తీసుకెళ్లారు.. మమ్మల్ని ఇళ్ల నుంచి బయటికి రానివ్వడం లేదు. ప్రభుత్వం ఎందుకింత కర్కషంగా వ్యవహరిస్తుంది.. ముందుగా మా వారి ఆచూకీ చెప్పండి..' అంటూ చిన్నోనిపల్లె మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సైతం చిన్నోనిపల్లె, రిజర్వాయర్ పనుల వద్ద భారీగా పోలీస్ బలగాలు మోహరించాయి. అధికారుల పర్యవేక్షణలో రిజర్వాయర్ పనులు కొనసాగాయి. ఇంతకీ చిన్నోనిపల్లిలో ఏం జరుగుతోంది.. పోలీసులు భారీ ఎత్తున ఎందుకు మోహరించారు.

2,500 ఎకరాలు ముంపు..

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా 101 ప్యాకేజీలో గట్టు మండలం చిన్నోనిపల్లి గ్రామం వద్ద 1.50 టీఎంసీల సామర్థ్యంతో రూ.37 కోట్లతో రిజర్వాయర్ పనులను 2006లో పనులు పెట్టారు. మొదట పొలాలకు సాగునీరు అందిస్తామని రైతులను నమ్మించిన అధికారులు ఆ తర్వాత పొలాలకు సంబంధించి పరిహారం, ఆర్‌అండ్ఆర్‌కు సంబంధించిన స్థల సేకరణ ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. పైగా తమ భూములకు ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించని రిజర్వాయర్ కోసం 2,500 ఎకరాల భూములతోపాటు 251 గడపలున్న గ్రామం మొత్తం ముంపునకు గురవుతుంటే నిర్వాసితులు తట్టుకోలేకపోయారు.దీంతో పనులు అడ్డుకుని ఆందోళన చేయడం, అదే సమయంలో తెలంగాణ ఉద్యమం తారాస్థాయికి చేరడంతో 90 శాతం పూర్తయిన పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి.

దశాబ్దంన్నర తర్వాత..

సుమారు దశాబ్దంన్నరపాటు ఆగిపోయిన చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులను పూర్తి చేసేందుకు ఏడాది కిందట సీఎంఓ కార్యదర్శి స్మితాసబర్వాల్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చిన్నోనిపల్లెని సందర్శించారు. ఈ క్రమంలో నిర్వాసిత గ్రామస్తులు పనులు ఆపేసి, రిజర్వాయర్‌ను రద్దు చేయాలని స్మితాసబర్వాల్‌కు విన్నవించారు. కానీ, ఆమె మిగిలిన పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించి వెళ్లడంతో నిర్వాసితులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. 423 రోజులుగా ఐదు గ్రామాలకు చెందిన నిర్వాసిత రైతులు ఆందోళన చేస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే ఏకంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సైతం దీక్ష చేపట్టి తమ గోడు వెళ్లబోసుకున్నారు.

చుట్టుముట్టూ బలగాలు..

ఏడాదిన్నరగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న నిర్వాసితులను శనివారం పోలీసు బలగాలు అదుపులోకి తీసుకుని జిల్లాలోని శాంతినగర్, అయిజ పోలీసుస్టేషన్లకు తరలించారు. అలాగే చిన్నోనిపల్లిలో 144 సెక్షన్ విధించి ఎవరినీ బయటకు రాకుండా కట్టుదిట్టం చేశారు. ఆదివారం తెల్లవారక ముందే పోలీసు బలగాలు చిన్నోనిపల్లిని చుట్టుముట్టేశాయి. దీంతో గ్రామంలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం గ్రామంలో వృద్ధులు, మహిళలు, చిన్నిపిల్లలు మాత్రమే మిగిలారు. పనులు ప్రారంభించారనే విషయం తెలుసుకున్న కొందరు మహిళలు అడ్డుకునేందుకు వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకుని వెనక్కి పంపారు. దీంతోపాటు చిన్నోనిపల్లెకి చేరుకునే రహదారులన్నింటిని పోలీసులు మూసేశారు. మిట్టదొడ్డి స్టేజీ వద్ద కర్నూలు– రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారిపై పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. చాగదోన, చిన్నోనిపల్లె రోడ్డులో చాగదోన వద్ద మరో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. లింగాపురం– చిన్నోనిపల్లి, అంతంపల్లి– చిన్నోనిపల్లి, బోయలగూడెం– చిన్నోనిపల్లి, ఇందువాసి ఇలా చిన్నోనిపల్లికి ఎన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉందో అన్నింటిపై బారీకేడ్లను ఏర్పాటు చేసి, పోలీస్ బలగాలను మోహరించారు. చిన్నోనిపల్లె వైపు వెళ్లే ప్రతి వ్యక్తిని, వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

ఇంటెలిజెన్స్ అధికారుల ఆరా..

చిన్నోనిపల్లె రిజర్వాయర్ పనులను ప్రారంభించిన తరుణంలో ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే మఫ్టీలో ఇంటెలిజెన్స్ అధికారులు గ్రామాల సరిహద్దుల చుట్టు గ్రామస్తుల కదలికలపై నిఘా పెట్టారు. పనులను ఎవరైనా అడ్డుకునే అవకాశం ఉందా అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇంటెలిజెన్స్ ఏఎస్పీ సత్యనారాయణ రిజర్వాయర్ పనులు జరిగే చోటకు వచ్చి వెళ్లారు.



చాగదోన వద్ద పోలీసు బలగాలు

మా భర్తలెక్కడ..?

అర్ధరాత్రి ఇంట్లో ఉన్న భర్తలను పోలీసులు పట్టుకెళ్లారని, వారెక్కడున్నారో చెప్పాలని మహిళలు పెద్దఎత్తున ఇళ్ల నుంచి బయటకు వచ్చి, పనులు జరిగే చోటుకు తరలివెళ్లారు. కానీ, పోలీసు బలగాలు మధ్యలోనే వారిని అడ్డుకున్నాయి. డీఎస్పీ స్థాయి అధికారి మహిళలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని, పోలీసు బలగాలతో ఊరి నుంచి బయటకు వెళ్లడానికి కూడా వీలు లేకుండా చేస్తున్నారంటూ మహిళలు మండిపడ్డారు. ఏమైనా ఉంటే కలెక్టర్‌ను కలిసి చెప్పుకోవాలని, పనులు మాత్రం అడ్డుకోవడం కుదరదని పోలీసు అధికారులు మహిళలకు తేల్చిచెప్పి బలవంతంగా అక్కడి నుంచి వెనక్కి పంపారు.



నిర్మానుష్యంగా చిన్నోనిపల్లె గ్రామం

అధికారుల పర్యవేక్షణలో..



ప్రారంభమైన రిజర్వాయర్ పనులు

చిన్నోనిపల్లె పెండింగ్ పనులను అధికారులు దగ్గరుండి కొనసాగిస్తున్నారు. నెట్టెంపాడు ఈఈ రహీముద్దీన్, జుబేర్ అహ్మద్, గద్వాల ఆర్డీఓ రాములు, డీఎస్పీ రంగస్వామి, తహసీల్దార్లు సుబ్రమణ్యం, అహ్మద్, ఏఈలు, డీప్యూటీ తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐలు శ్రీనివాసులు, కరీం, ఎంపీడీఓ చెన్నయ్యతోపాటు ఇరిగేషన్ అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు.

రైతులను విడుదల చేయాలి : అఖిలపక్షం



శాంతినగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట నినాదాలు చేస్తున్న అఖిలపక్ష నాయకులు

శాంతినగర్: చిన్నోనిపల్లె రిజర్వాయర్ భూనిర్వాసితులను అక్రమంగా అరెస్ట్ చేసి స్టేషన్‌లో ఉంచడం సరికాదని, వెంటనే విడుదల చేయాలని ప్రజాసంఘాలు, సీపీఐ, సీపీఎం, వైఎస్ఆర్‌టీపీ, టీజేఎస్, సీఐటీయూ అకిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అర్ధరాత్రి చిన్నోనిపల్లె నుంచి నిర్వాసిత రైతులను పోలీసులు అరెస్టు చేసి శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న అఖిలపక్షం నాయకులు ఆదివారం సాయంత్రం శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు మెట్ట రూ.70వేలు, తరి పొలానికి రూ.90 వేల చొప్పున ఇచ్చారని, అంతేగాక రిజర్వాయర్ నిర్మాణం వలన భూములు కోల్పోయిన రైతులకు ఒరిగేది లేదని, ఏడాదిపాటు నిరసనలు తెలిపినా పట్టించుకోకుండా అధికారులు పనులు చేపట్టడం ఎంతవరకు సబబని ఎస్ఐని ప్రశ్నించారు. స్పందించిన ఎస్ఐ శ్రీనివాసులు రైతులను సాయంత్రం విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించి వెళ్లిపోయారు. ఎస్ఐని కలిసిన వారిలో వైఎస్ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు అతీక్ రెహమాన్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఆలూరు ప్రకాష్‌గౌడ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ, పరంజ్యోతి వున్నారు.

రిజర్వాయర్‌ను రద్దు చేయాలి

చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేసి.. భూములను తిరిగి రైతులకు అప్పజెప్పాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ తెలిపారు. ఆదివారం గట్టులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రిజర్వాయర్ పనులు ప్రారంభించే క్రమంలో అర్ధరాత్రి వేళ గ్రామానికి వెళ్లి అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్లకు తీసుకెళ్లడం అన్యాయమని, గ్రామానికి వెళ్లే రోడ్లన్నీ దిగ్బంధించడం సరికాదన్నారు. రైతులను విడిచి పెట్టాలన్నారు.

336మందికి ఇళ్ల పట్టాలు

నెట్టెంపాడు ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ముంపునకు గురైన చిన్నోనిపల్లెలోని 360మందికిగాను 336 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేసినట్లు ఆర్డీఓ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం కోసం 2,500 ఎకరాలను 2005లో సేకరించినట్లు, ఇందుకు సంబంధించి నష్టపరిహారం అప్పట్లోనే అందజేశామని తెలిపారు. రైతులు పరిహారం సరిపోదని కోర్టుకు వెళ్లగా రెండవ విడతలో మళ్లీ రూ.14.82కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. చిన్నోనిపల్లెలో మిగిలిన 24పట్టాలను త్వరలోనే పంపిణీ చేస్తామని, భవిష్యత్తు తరాల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని పనులు పూర్తి చేసేందుకు రైతులు సహకరించాలని కోరారు.

పొలాలిచ్చి ఎట్లా బతకాలి



మా గోడు చెప్పుకునేందుకు కూడా ఇంట్ల నుంచి బయటకు కూడా పంపుత లేరు. ఊరి చుట్టూ పోలీసులాయే. ఎక్కడికి పోవాలి, ఏమని చెప్పుకోవాలి. కలెక్టర్‌కు చెప్పుకుందామంటే ఊరిడిసి పోవాలే కదా. మాకు ఈ రిజర్వాయర్ వద్దు. పచ్చని పంట పొలాలను ఇడిసి ఎట్లా బతకాలే. పునరావాస కేంద్రంలో ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. పిల్లలు చదువుకునేందుకు బడులు లేవు. రోడ్లు లేవు. ఉండడానికి ఇండ్లు లేవు. ఊరు ఇడిసి పెట్టమంటే ఎక్కడికి పోయి బతకాలే.

– సంధ్య, చిన్నోనిపల్లె

ఇళ్లు లేవు, పట్టాల్లేవు



పునరావాస కేంద్రంలో ఇళ్లు లేవు, ఇళ్ల పట్టాల్లేవు. అధికారులేమో రిజర్వాయర్ కట్ట పనులు పూర్తి చేయడానికి ఉరుకులాడుతున్నారు. వానాకాలంలో వానలకు ఇళ్లలోకి నీళ్లు వస్తే రోడ్లపై ఉండాలా..? పునరావాస కేంద్రంలో ఏం పనులు చేయలేదు. ఊరిని వదిలి ఎట్లా పోవాలి.

– గోవిందమ్మ, చిన్నోనిపల్లె

న్యాయం చేయాలి



చిన్నోనిపల్లె భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలి. గతంలో ఇచ్చిన పరిహారం ఎప్పుడో ఖర్చు అయిపోయింది. పెరిగిన రేట్లకు అనుకూలంగా పునరావాస కేంద్రంలో ఇళ్లు నిర్మించుకోవాలంటే ఇబ్బందే. ఈ భూములను నమ్ముకొని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. ఆయకట్టు లేకుండానే నిర్మించే రిజర్వాయర్‌ను రద్దు చేసి, రైతుల భూములను రైతులకే అప్పగించాలి.

– పారిజాత, చిన్నోనిపల్లె

చర్యలు తీసుకుంటాం

చిన్నోనిపల్లె రిజర్వాయర్ నిర్మాణం కోసం 2006లో రూ.32 కోట్లు కేటాయించారు. ఇందులో 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. కట్ట మధ్యలో 625 మీటర్ల గ్యాప్, స్లూయిజ్, అలుగు పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. అవి పూర్తి చేస్తున్నాం. పునరావాస కేంద్రంలో రోడ్లు, తాగు నీరు, విద్యుత్ సరఫరా వంటి పనులు చేపడుతున్నాం.

– రహీముద్దీన్, ఈఈ

'ప్రసాద్ స్కీం'తో అగ్రగామిగా..




ప్రసాద్ స్కీం కింద నిర్మించే భవనసముదాయం (ఊహా చిత్రం)

అలంపూర్‌కు రూ.37 కోట్లు కేటాయించిన కేంద్రం

- ఫేజ్–1లో రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు
- చివరి దశలో అధునాతన భవన సముదాయం
- 'మే' మొదటి వారంలో పూర్తికానున్న నిర్మాణాలు
- సర్వాంగ సుందరంగా మారుతున్న జోగుళాంబ ఆలయాలు



నది తీరాన రూపుదిద్దుకుంటున్న మూడంతస్తుల భవనం



నిర్మాణంలో కల్యాణమండపం

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలో ఏకైక ఐదో శక్తిపీఠమైన జోగుళాంబ ఆలయాల రూపురేఖలు మారబోతున్నాయి. ఇక్కడి పురాతత్వ కట్టడాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ప్రసాద్ స్కీం' పథకం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులతో అలంపూర్ అగ్రగామిగా నిలవనుంది. ఈ స్కీం కింద రూ.37 కోట్లను మంజూరు చేయగా.. తొలి విడత పనుల్లో భాగంగా పర్యాటకుల కోసం రూ.20.81 కోట్లతో అధునాతనమైన మూడంతస్తుల భవనం, మినీ బస్టాండ్, ఆలయాలకు ప్రహరీ, అప్రోచ్ రోడ్, విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు, బోట్ సౌకర్యం వంటి నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అయితే స్థానికంగా ఈ పనులకు అది నుంచి తరచూ ఎన్నో అవరోధాలను, అడ్డంకులు ఎదురవుతున్నా అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాల ఒత్తిడి మేరకు కేపీసీ కంపెనీ వారు పనులను శరవేగంగా చేపడుతున్నారు.

అవరోధాలను దాటుకొని..

భవన నిర్మాణం కోసం 1,200 ఫీట్ల లోతులో రెండు సార్లు బోర్ వేసినా చుక్క నీరు పడకపోవడంతో సమీపంలోని తుంగభద్ర నదిలో మోటార్లు వేసి నీటిని తీసుకుని అతి కష్టం మీద పనులు చేస్తున్నారు. అనంతరం మిషన్ భగీరథ నీటిపై ఆధారపడుతున్నట్టు సమాచారం. ఇక పక్కనే నది ఉండి ఇసుక ఉన్నా వాటికి అనుమతులు రాక పనుల్లో ఆలస్యమైంది. సంగమేశ్వర ఆలయం నుంచి 120 మీటర్ల మేర మెయిన్ రోడ్డుకు వేయాల్సిన అప్రోచ్ రోడ్డులో ప్రైవేట్ భవనాలు ఉండటంతో పనులు నిలిచిపోయాయి. అలాగే తుంగభద్ర బ్రిడ్జి వద్ద 4.2 ఎకరాల్లో చేపట్టాల్సిన మినీ బస్ డిపో కోసం పునాదులు తీయగానే అవి తమ స్థలాలంటూ స్థానికులు అడ్డుకున్నారు. ఆ స్థలంలో నదిలోని పొలాలకు నీటి పైపులు వేసుకున్న రైతులు సైతం అభ్యంతరం చెబుతున్నారని అధికారులు తెలిపారు. మినీ బస్ డిపో దగ్గర హైవోల్టేజీ విద్యుత్ తీగలు వెళ్లడంతో డిజైన్‌లో మరోసారి మార్పులు చేశారు. ఇక మినీ బస్ డిపో నుంచి బిల్డింగ్, యోగా నారసింహ స్వామి ఆలయాలను కలుపుతూ పుష్కర ఘాట్ వరకు రావాల్సిన రోడ్డు ఆక్రమణకు గురికావడంతో పనులు నిలిచిపోయాయి.

అభ్యంతరాలు చెబుతున్నారు..



ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారి నుంచి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డీపీఆర్‌లో ఉన్నటువంటి పనులు చేపడుదామంటే ఇక్కడి మన్యూమెంట్ నిబంధనలంటూ సంబంధిత అధికారులు పనులకు అభ్యంతరం చెబుతున్నారు. అన్ని శాఖలు, స్థానికంగా ప్రజలు సహకరిస్తే ఈ పనుల్లో మరింత వేగం పెరిగి పర్యాటకుల సందడి నెలకొంటుంది.

– ధన్‌రాజ్, డీఈ, పర్యాటక శాఖ

క్షేత్రానికి మరింత శోభ



ప్రసాద్ స్కీం కింద జరుగుతున్న పనులతో ఈ క్షేత్రం మరింత శోభను సంతరించుకోనుంది. పనులు కూడా చాల వేగంగా జరుగుతున్నాయి. భక్త యాత్రికులకు సౌకర్యాల లేమి అనే మాటకు తావు లేకుండా ఇక్కడ అభివృద్ధి పనులు చేపడుతున్నాం. దేవస్థానం తరఫున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు.

– పురేందర్‌కుమార్, ఆలయ ఈఓ

చేపడుతున్న అభివృద్ధి పనులు..

ప్రస్తుతం 3.5 ఎకరాల స్థలంలో భక్తుల సౌకర్యార్థం మూడు అంతస్తుల భవనం, తుంగభద్ర బ్రిడ్జి వద్ద 5.2 ఎకరాల్లో మినీ బస్టాండ్ నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే 80 శాతం మేర జరిగిన ఈ పనులు మే నెల మొదటి వారంలోగా పూర్తవుతాయని పర్యాటక శాఖ డీఈ ధన్‌రాజ్ తెలిపారు. ఈ భవనంలో ఫస్ట్ ఫేస్‌లో 500 మంది కూర్చొని చూసే విధంగా యాంఫీ థియేటర్ నిర్మాణం, ప్రధాన భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో విశాలమైన వంటగది, అన్నదాన సత్రం, డైనింగ్ హాల్, ఫుడ్ కోర్టు, టికెట్ కౌంటర్, ఎంట్రెన్స్ లాబీ, ఫోయర్, మూత్రశాలలు, మరుగుదొడ్లు, మూడు లిఫ్టులు, అలాగే తూర్పు, దక్షిణ, ఉత్తరం వైపు విశాలమైన మెట్లు నిర్మించారు. మొదటి అంతస్థులో ఈ ప్రాంత ప్రాముఖ్యతను చాటే విధంగా ఎగ్జిబిషన్ గ్యాలరీ, మల్టీ మీడియా, కల్యాణ మండపం, డైనింగ్ హాల్, వాటికి అనుగుణంగా కార్యాలయం, రెండో అంతస్థులో ఎల్ ఆకారంలో 19 మినీ డీలక్స్ రూంలు నిర్మించారు. ఇందులో బస చేసే యాత్రికులకు నదీతీర ప్రకృతి అందాలు, ఆలయాలు కనిపించేలా భవనాన్ని తీర్చిదిద్దారు. మినీ బస్టాండ్, కల్వర్టు, బిల్డింగ్ నుంచి యోగా నారసింహస్వామి ఆలయం మీదుగా పుష్కర ఘాట్ వరకు వెళ్లేందుకు వీలుగా అప్రోచ్ రోడ్ చేపట్టారు.

న్యూస్‌రీల్

ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ

ఎర్రవల్లిచౌరస్తా: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర ఆదివారం ఇటిక్యాల మండలంలోని దువాసిపల్లి, సాసనూలు, షేకుపల్లి, బీ.వీ రావురం, కార్పాకుల గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎంత మంది పేదలకు ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు. ప్రజలు కాంగ్రెస్ పాలన కోసం ఎదురు చూస్తున్నారని, ప్రజలు ఆశీర్వదిస్తే వారి ఆకాంక్ష మేరకు త్వరలోనే కాంగ్రెస్ రాజ్యం రాబోతోందన్నారు. ఆయన వెంట నాయకులు జోగుల రవి, రుక్మాందర్‌రెడ్డి, వెంకటేష్, వెంకటన్న, ఉశేన్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



గట్టులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

గట్టు: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించాలని పార్టీ జిల్లా ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ తక్కెలపల్లి రవీందర్‌రావు సూచించారు. ఆదివారం గట్టులో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమేశనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సీఎం కేసీఆర్ విజన్ వల్లే రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళుతున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలకు రాజకీయాలు తప్పా, ప్రజా సంక్షేమం కన్పించదన్నారు. సీఎం కేసీఆర్ కృషి వలన రాష్ట్రం దేశంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు నడిగడ్డ అంటేనే కరువుకు నిలయంగా ఉండేదని, ప్రాజెక్టు పుణ్యమా అంటూ పచ్చని పంటల కారణంగా ఈ ప్రాంతం మరో కోనసీమను తలపిస్తుందన్నారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాల వారు ఇక్కడి వచ్చే పరిస్థితి ఉందన్నారు. గట్టు ఎత్తిపోతలను పూర్తి 30వేల ఎకరాలకు సాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. గట్టు మండలంలో రూ.350 కోట్ల వివిధ అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ప్రశాంతంగా ఉండే గ్రామాల్లో మతచిచ్చు పెట్టడడానికి వచ్చే వారికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. స్టేట్ కన్స్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జెడ్పీ వైస్ చైర్మన్ సరోజమ్మ, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, ఎంపీపీలు విజయ్‌కుమార్, రాజారెడ్డి, నజూమున్నీసాబేగం, జెడ్పీటీలు బాసు శ్యామల, రాజశేఖర్ ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, రామకృష్టారెడ్డి పాల్గొన్నారు.

షాపుల కేటాయింపులో కుమ్మక్కు

- పోటీకి రాకుండా తాయిళాలు
- ప్రతి నెలా అద్దె రూపంలో గ్రామపంచాయతీకి రూ.2.13లక్షలు ఆదాయం



గట్టులోని షాపింగ్ కాంప్లెక్స్

గట్టు: పక్కపక్కనే ఉండే తొమ్మిది షాపులకు వేలం నిర్వహించగా ఒక షాపు రూ.65వేలు పలకగా.. అత్యధిక డిమాండ్ ఉన్న మరో షాపు అనూహ్యంగా అతి తక్కువకు రూ.5500లకు వేలంలో దక్కించుకోవడంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గట్టు గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన దుకాణ సముదాయాల వేలం పాట పోటాపోటీగా కొనసాగిన విషయం తెలిసిందే. బస్టాండ్ ఆవరణలో ఉన్న మూడు దుకాణాలకు ఎక్కువ సంఖ్యలో వేలంలో పాల్గొనేందుకు వ్యాపారస్తులు ఆసక్తి చూపారు. వీటికి పెద్ద ఎత్తున డిమాండ్ ఉండడంతో పోటాపోటీగా వేలం పాట పాడడం ఖాయమనుకున్నారు. అనూహ్యంగా షాపు నం.1 వేలంలో కేవలం రూ.5500లకే పరిమితమైంది. షాపు నం.2మాత్రం భేరసారాలు కుదరక అత్యధికంగా రూ.68 వేల అద్దెకు పోటాపోటీగా వేలం సాగింది. అయితే 1వ షాపు కేవలం రూ.5500లకు వేలం పాడడం వెనుక భేరసారాలు పెద్ద ఎత్తున సాగినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ షాపునకు 15 మంది పోటీపడగా పోటీదారులకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున 14 మందికి రూ.3.50 లక్షల గుడ్‌విల్ ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నట్లు బయట గుసగుసలు వినిపిస్తున్నాయి. అలాగే, షాపు–3 కూడా కేవలం రూ.4500లకు వేలం పాడడంపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పట్టణాలకు తీసిపోని రీతిలో అద్దెలు..

ఇదిలాఉండగా, గట్టులో పట్టణాలకు మించిన రీతిలో దుకాణాల వేలం పాడడం గ్రామస్తులను ఆశ్చర్యానికి గురి చేసింది. షాపు నం.2కు 12 మంది పోటీ పడగా అత్యధికంగా నెలకు రూ.68 వేల అద్దె చెల్లించే విధంగా వేలం పాడారు. షాపు నం–5కి 15 మంది పోటీ పడగా నెలకు 38,200 అద్దె చెల్లించే విధంగా వేలం పాడి దక్కించుకున్నారు. 4, 6 నం. షాపులు 30వేలకు వేలం పాటలో దక్కించుకున్నారు. పంచాయతీ దుకాణాల్లో 1, 3 షాపులు మాత్రమే తక్కువ వేలం పాడగా, మిగతా అన్ని రూ.9 వేలకు పైగానే కేటాయించారు. గట్టు పంచాయతీకి అద్దె రూపంలో నెలకు రూ.2,13,500, డిపాజిట్ రూపంలో రూ.4,30,000ల ఆదాయం లభించింది.

క్లుప్తంగా

రైతు మృతి

మక్తల్: మండలంలోని గుర్లపల్లి చెందిన రైతు మొగులప్ప(55) ఆదివారం పొలానికి మందు కొడుతూ అస్వస్థతకు గురయ్యాడు. కళ్లు తిరుగుతున్నాయని చెప్పడంతో చుట్టుపక్కల వారు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా వైద్యులు ఎవరూ లేకపోవడంతో 45 నిమిషాల పాటు అక్కడే ప్రాణాలతో కొట్టుమిట్లాడుతూ మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. చనిపోయిన తర్వాత వచ్చి చికిత్స చేస్తున్నారని గ్రామస్తులు మండిపడ్డారు. డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో కొత్తకుంటపల్లి వాసి మృతి


లింగస్వామి(ఫైల్)

లింగాల: మండలంలోని కొత్తకుంటపల్లికి చెందిన బోయ లింగస్వామి (35) హైదరాబాద్‌లో మృతి చెందాడు. జీవనోపాధి కోసం భార్యాపిల్లలతో కలిసి గతేడాది హైదరాబాద్ వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. యాప్రాల్ ప్రాంతంలో ఉంటూ భవన నిర్మాణ పని చేస్తున్నాడు. శనివారం పనికి వెళ్లిన అతను భవనం నాల్గవ అంతస్తులో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు పై నుంచి కాలు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య బస్వమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ బలవన్మరణం

మద్దూరు: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పల్లెర్లలో ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి భీమమ్మ(39) కొంత కాలంగా కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో మనస్తాపానికి గురైంది. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. పెద్ద కుమారుడు గమనించి తండ్రి హన్మంతుకు సమాచారం ఇవ్వడంతో నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లుగా నిర్ధారించారు. భర్త ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్యాంసుందర్ తెలిపారు.

తెగిన విద్యుత్ లైన్


రోడ్డుపై తెగిపడిన విద్యుత్ తీగ

జడ్చర్ల: స్థానిక సాయినగర్ కాలనీలోని సెయింట్‌పాల్ స్కూల్ వద్ద ఆదివారం తెల్లవారుజామున ఈదురుగాలులకు విద్యుత్ లైన్ తెగి నేలపై పడింది. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. అనంతరం విద్యుత్ శాఖ సిబ్బంది తీగను సరి చేసి పునరుద్ధరించారు.

వివాహిత అదృశ్యం

రాజోళి: వివాహిత అదృశ్యమైన సంఘటనపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రానికి చెందిన వివాహిత ఈ నెల 16వ తేదీన బహిర్భూమికని వెళ్లింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె తండ్రి రేపల్లె బీసన్న చుట్టు పక్కల వారి దగ్గర, బంధువుల వద్ద ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

భర్తపై వేధింపుల కేసు నమోదు

గద్వాల క్రైం: భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ అబ్దుల్‌షుకూర్ తెలిపారు. పట్టణంలో నివాసం ఉంటున్న అంజమ్మ, ఆశన్న ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్ని నెలలుగా ఆశన్న మద్యానికి బానిసై భర్త అనుమానంతో వేధింపులకు గురి చేస్తున్నాడు. ఆదివారం తీవ్ర మనస్తాపం చెంది భర్తపై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యవసాయ మోటార్లు చోరీ


పగిలిపోయిన పైపులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలం జిల్లెడుదిన్నె శివారులోని ఇద్దరు రైతులకు చెందిన వ్యవసాయ మోటార్లు శనివారం రాత్రి చోరీకి గురయ్యాయి. శాంతినగర్‌కు చెందిన రామన్‌గౌడ్, వెంకట్రామనగర్‌కు చెందిన తిప్పన్న ఆర్డీఎస్ డీ–26లో మోటార్లు అమర్చుకుని పొలాలకు నీటిని పారుదల చేస్తున్నారు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లగా కాల్వలో పైపులు పగులగొట్టి మోటార్లు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు తెలిపారు. రామన్‌గౌడ్‌కు చెందిన రెండు ఫిల్టర్లు చోరీకి గురయ్యాయని, మొత్తం రూ.లక్ష వరకు నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈవిషయమై ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లగా స్టేషన్‌లో ఎవరూ లేరంటూ ఫిర్యాదు తీసుకోలేదని రైతులు వాపోయారు.

హైవే పనులు ప్రారంభం

- 32 హెక్టార్లలో భూసేకరణ ప్రక్రియ పూర్తి
- రోడ్డుకు ఇరువైపుల చెట్ల తొలగింపు
- కొనసాగుతున్న లెవలింగ్ పనులు


సంపల్లి సమీపంలో చెట్ల తొలగింపు

గండేడ్: మహబూబ్‌నగర్–చించోలి జాతీయ రహదారి పనులు ప్రారంభమయ్యాయి. బెంగుళూరు – ముంబాయి మధ్య ఉన్న జాతీయ రహదారులను అనుసంధానం చేసేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని భూత్పూర్ నుంచి కర్ణాటకలోని మన్నెకలి వరకు ఉన్న 192 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిగా విస్తరించడానికి ప్రణాళిక రూపొందించారు. గతంలో అంతర్రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా చేస్తామని కేంద్ర మంత్రి నితిన్‌గడ్కారి ప్రకటించిన్నట్టుగానే ఏడాదిలోపే రూ.703 కోట్లు గతేడాది సెప్టెంబరు నెలలో నిధులు మంజూరు చేశారు. రాష్ట్రంలో మూడు జిల్లాలను కలుపుతూ వెళ్తున్న ఈరోడ్డును 167 జాతీయ రహదారిగా గుర్తించారు. ఇందులో భాగంగానే ఇటీవల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రోడ్డు పనులు ప్రారంభించారు. దీంతో క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యాయి.

32 హెక్టార్ల భూసేకరణ పూర్తి..

మహబూబ్‌నగర్ కొత్త కలెక్టరేట్ నుంచి పాలమూరు యూనివర్సిటీ, బండమీదిపల్లి, వీరన్నపేట మీదుగా మున్సిపాలిటీ డంపింగ్‌యార్డు ఆనుకొని చిన్నదర్పల్లి దాటి 8 కిలోమీటర్ల మేర బైపాస్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించి అందుకు భూసేకరణ పూర్తి చేశారు. దీంతో పాటు రంగారెడ్డిపల్లి వద్ద రోడ్డు మలుపు ప్రమాదకరంగా ఉండడంతో రీఅలైన్‌మెంట్ చేయాలని నిర్దేశించారు. ఇందులో భాగంగా 4 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. మొదట్లో రైతులు ఇందుకు ఒప్పుకోకపోయిన అధికారులు సర్దిచెప్పడంతో విస్తరణకు ఒప్పుకున్నారు. దీంతో పాటు అంచన్‌పల్లి వద్ద టోల్ బూత్ ఏర్పాటుకు అత్యవసర సేవలకు అంబులెన్సు, టోల్‌ప్లాజా సిబ్బంది ఉండేందుకు 1.13 ఎకరాల భూమి అవసరమని గుర్తించి సేకరించారు. భూత్పూర్ నుంచి దుద్యాల వరకు రోడ్డు విస్తరణకు మొత్తం 32 హెక్టార్ల (80 ఎకరాలు) భూమి సేకరించారు. ఇందుకు సంబంధించి నిర్వాసితులు అంగీకారం ఇచ్చారు. దీంతో పనులు మొదలుపెట్టారు. త్వరలో వీరికి ప్రభుత్వం డబ్బులు చెల్లించనుంది.

రోడ్డుకు ఇరువైపులా చెట్ల తొలగింపు


గొల్లగడ్డ సమీపంలో పొదల తొలగింపు

విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించడం ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణానికి నిధుల విడుదలకు రెండు ప్యాకేజీలు రూపొందించారు. మొదటి ప్యాకేజీలో భాగంగా భూత్పూరు నుంచి దుద్యాల వరకు 60 కిలోమీటర్ల రోడ్డు విస్తరించేందుకు రూ.440 కోట్ల టెండర్ వేశారు. టెండర్లు పూర్తి కావడంతో విస్తరణ పనులు ప్రారంభించారు. ముందుగా దుద్యాల నుంచి మహబూబ్‌నగర్ వైపు చెట్లను తొలగించడం మొదలు పెట్టారు. కోస్గి, జానంపల్లి, రంగారెడ్డిపల్లి, సల్కర్‌పేట్ గ్రామాల పరిధిలోని చెట్లను, పొదలు, కంప చెట్లు తొలగిస్తున్నారు. ఇరువైపులా భూమిని చదును చేస్తున్నారు. ముంబాయి – బెంగుళూరుకు దాదాపు 150 కిలోమీటర్ల దూరం తగ్గడం మూలంగా ఈ రోడ్డు విపరీతమైన రద్దీ ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో సమస్యలు లేకుండా ఉండాలని బ్రిడ్జిలు, ఆర్‌ఓబీలు, జంక్షన్లు తదితర వాటిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 40 మలుపులను నేరుగా చేయనున్నారు. వీటితో పాటు భూత్పూర్ వద్ద రెండు చోట్ల బ్రిడ్జిలు అవసరమని గుర్తించారు. ఇవి మినహా మిగతా అన్ని చోట్ల ఉన్న రోడ్డునే విస్తరించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

నెల రోజుల్లో పూర్తి స్థాయి పనులు



రోడ్డు విస్తరణకు ఉన్న అడ్డంకులు తొలగించే పనులు ప్రారంభమయ్యాయి. పెద్ద చెట్లు, పొదలు తొలగిస్తున్నారు. వెంటవెంటనే రెండు వైపుల చదును చేస్తున్నారు. అది పూర్తయ్యాక రోడ్డు పనులు పూర్తి స్థాయిలో ప్రారంభమవుతాయి. ఇందుకు మరో నెల సమయం పడుతుంది. అప్పటి వరకు అన్ని అడ్డంకులు తొలగిస్తాం.

– రమేష్, డీఈ నేషనల్ హైవే అథారిటీ

వ్యవసాయ పొలంలో భారీ మొసలి


మొసలిని బంధించిన గ్రామస్తులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వెల్టూర్‌లో రైతు బాల్‌రెడ్డి వ్యవసాయ పొలంలో ఆదివారం మొసలిని గుర్తించాడు. ఆయన ఎస్‌ఐ హరిప్రసాద్‌కు ఫోన్ ద్వారా సమాచారం చేరవేశాడు. ఎస్‌ఐ స్నేక్ సొసైటీ నిర్వాహకుడు కృష్ణసాగర్‌కు సమాచారం ఇవ్వడంతో గ్రామానికి చేరుకున్నారు. నీటి గుంటలో ఉన్న మొసలిని బయటకు తీసుకొచ్చేందుకు పోలీసులు, గ్రామస్తులు ఎంతో శ్రమించారు. చివరకు పొక్లేన్ సాయంతో పట్టుకున్నారు. మొసలి వయస్సు 30ఏళ్ల ఉండవచ్చని, 12ఫీట్ల పొడవు, 270కిలోల బరువు ఉంటుందని, పట్టుకున్న మొసలిని జూరాల ప్రాజెక్టులో వదిలినట్లు కృష్ణసాగర్ తెలిపారు.

అర్ధరాత్రి యువకుల హల్‌చల్

- బర్త్‌డే వేడుకలంటూ తల్వార్లతో రోడ్లపై హంగామా
- వనపర్తి జిల్లాకేంద్రంలో ఘటన

వనపర్తి: జిల్లాకేంద్రంలో శనివారం అర్ధరాత్రి బర్త్‌డే వేడుకల పేరుతో కొందరు యువకులు రోడ్లపై హల్‌చల్ చేసిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. శనివారం రాత్రి 15 మందికిపైగా యువకులు పట్టణంలోని కాలనీల్లో మోటార్‌సైకిళ్లపై చక్కర్లు కొడుతూ.. కేకులు కట్ చేస్తూ.. చేతుల్లో తల్వార్‌లు పట్టుకుని అల్లర్లు సృష్టించడంతో కొందరు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. పెట్రోలింగ్ పోలీసులు అప్రమత్తమై వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా.. రాకను గమనించి యువకులు పారిపోయినట్లు ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం బసవన్నగడ్డ కాలనీకి చెందిన ఓ వ్యక్తి కత్తులతో వచ్చిన యువకులు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారని పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారని, ఈ విషయమై ఉన్నతాధికారులు, కోర్టు అనుమతి తీసుకుని కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ చెప్పారు. ఈ విషయం మంత్రి నిరంజన్‌రెడ్డికి వెళ్లడంతో వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం.

అధ్వానంగా అంతర్గత రహదారులు


వెంకటేశ్వరకాలనీలో అధ్వానంగా మారిన ప్రధానరోడ్డు

- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- సీసీ రోడ్ల కోసం ఎదురుచూపులు
- తీరని డ్రెయినేజీ సమస్యలు

జడ్చర్ల: మున్సిపాలిటీలో అంతర్గత రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. దీంతో రాకపోకల సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత అత్యధిక నిధులు వచ్చి రోడ్లు, డ్రెయినేజీ, కనీస మౌలిక సదుపాయాలు కలుగుతాయని ఊహించిన పట్టణ ప్రజలకు తీరని నిరాశే మిగిలింది. దాదాపు లక్ష జనాభా కలిగిన పట్టణంలో అందుకు తగ్గట్లుగా సదుపాయాలు కల్పించడంతో మున్సిపల్ కౌన్సిల్, అధికార యంత్రాంగం విఫలమైంది.

27 వార్డుల్లో సమస్యలు

మున్సిపాలిటీలోని 27 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల్లో ప్రధానంగా రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు పేరుకుపోయాయి. ప్రతి వార్డులో ఇవే సమస్యలు ప్రధానంగా ఉండడంతో పాలకులు, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సరస్వతీకాలనీకి వెళ్లే ప్రధాన రహదారితో పాటు, కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. 3వ వార్డులోని వేంకటేశ్వరకాలనీలో రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు ఉన్నాయి. వీటితో పాటు లక్ష్మీకాలనీ, అయ్యప్ప కాలనీ, కండెరావు కాలనీ, సాయినగర్,అయోధ్యనగర్, వియనగర్ కాలనీ, గౌరీశంకర్‌కాలనీ, నిమ్మబాయిగడ్డ తదితర కాలనీలు ఉన్నాయి.

కొత్తకాలనీల్లో అంతే..

పట్టణం నలుదిక్కులా విస్తరిస్తుండడంతో అందుకు తగ్గట్లుగా రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు ఇతర సౌకర్యాలు కల్పించలేదు. కల్వకుర్తి రోడ్డును అనురించి వెలసిన పలు కాలనీలతో పాటు మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిని అనుసరించి విస్తరించిన కాలనీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. జాతీయ రహదారిని అనుసరించి ఏర్పాటవుతున్న పలు కాలనీలలో సమస్యలు పేరుకుపోయాయి.

రోడ్లు, డ్రెయినేజీలు లేవు..



వెంకటేశ్వరకాలనీలోని తమ ఇళ్ల ముందు కనీసంగా డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని ఎంతోకాలంగా కోరుతున్నాం. ఇళ్ల ఎదుటే మురుగు పారుతుంది. మట్టితో రోడ్డును చదును చేసినా బాగుండేది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

–లక్ష్మారెడ్డి, 3వ వార్డు, బాదేపల్లి

పరిష్కరిస్తాం..



మున్సిపాలిటీ పరిధిలో సమస్యలు ఉన్నాయి. దశలవారీగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సమస్యలను గుర్తించి ప్రతిపాదనలు నివేదించాం. నిధులు మంజూరు కాగానే పనుల ప్రగతికి కృషి చేస్తాం.

– మమ్మద్ షేక్, కమిషనర్, మున్సిపాలిటీ, జడ్చర్ల

తాళం వేసిన ఇంట్లో చోరీ

అచ్చంపేట రూరల్: మండలంలోని సిద్దాపూర్‌లో తాళం వేసిన ఇంటిలో చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన సత్యనారాయణ ఓ శుభకార్యానికి ఈనెల 17న అచ్చంపేటకు వెళ్లారు. తిరిగి ఆదివారం మధ్యాహ్నం భార్యతో ఇంటికి చేరుకోగా ఇంటి తాళం విరగ్గొట్టి ఉండటం గమనించారు. బీరువాలోని దుస్తులు చిందరవందరగా వేసి ఉండటం, రూ. 50వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. సిద్దాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ గురుస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కల్వకుర్తి పట్టణంలో..

కల్వకుర్తి టౌన్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనం అయిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీలో పాండయ్య వారి బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. శనివారం రాత్రి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి, ఇంట్లో ఉన్న నాలుగున్నర తులాల బంగారం, రూ.40వేల వరకు నగదును ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన వారికి తలుపులు పగులగొట్టి ఉండటంతో, పోలీసులకు సమాచారం ఇవ్వగా క్లూస్‌టీంను పిలిపించి పరిశీలించారు. పాండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

అధికారమే ధ్యేయంగా పనిచేయాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే ధ్యేయంగా యువజన కాంగ్రెస్ నాయకులు కష్టపడి పనిచేయాలని జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి, యూత్ జోడో బూత్ జోడో తెలంగాణ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి బూత్‌లో ఐదుమంది యువజన కాంగ్రెస్ నాయకులను సభ్యులుగా చేర్పించి పార్టీ బలోపేతం కోసం కృషిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజల్లో తీసుకెళ్లాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కోరారు. సమావేశంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుయాదవ్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హక్, నాయకులు నరేష్, అశోక్, రాఘవేందర్‌గౌడ్, వంశీచంద్‌రెడ్డి, సంధ్య, శివశంకర్‌గౌడ్, సల్మాన్, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

బ్రిడ్జి కిందకు దూసుకెళ్లిన కారు


ప్రమాదానికి గురైన కారు

ఊట్కూరు: కారు అదుపు తప్పి బ్రిడ్జి కిందకు దూసుకెళ్లిన సంఘటన శనివారం రాత్రి మండల కేంద్రం శివారులో చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట పట్టణంలో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న శశికాంత్ కుటుంబసభ్యులతో మంత్రాలయం దైవదర్శనానికి వెళ్లాడు. తిరిగి రాత్రి నారాయణపేటకు వస్తుండగా ఊట్కూరు శివారులో పూల్ బ్రిడ్జిపై పిల్లిని తప్పించబోయి అదుపుతప్పి కారు బ్రిడ్జి కిందకు దూసుకెళ్లింది. ఎదురుగా వచ్చిన వాహనదారులు కారు అద్దాలను పగులగొట్టి కుటుంబసభ్యులను బయటకు తీశారు. శశికాంత్‌కు స్వల్ప గాయాలు కావడంతో ఇతర వాహనంలో నారాయణపేట ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని హెడ్ కానిస్టేబుల్ తిమ్మారెడ్డి తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

జడ్చర్ల: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. దుందుబీ వాగు నుంచి రాత్రి ఇసుకను తరలిస్తుండగా స్థానిక సిగ్నల్‌గడ్డ వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

వీడని అకాల కష్టాలు


హన్వాడలో కురిసిన వడగండ్లు

హన్వాడ: మండలంలో వడగండ్ల వర్షం బీభత్సం సృష్టించింది. శనివారం రాత్రి కురిసిన అకాల వర్షం కారణంగా కూరగాయల తోటలు, పలు చోట్ల కల్లాల్లోని ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. పెద్దర్‌పల్లిలోని ఆంజనేయస్వామి రేకుల షెడ్డు గాలికి ఎగిరిపోయాయి. గ్రామాల్లోని రేకుల ఇళ్ల వారు వడగండ్ల వర్షానికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాత్రంతా జాగారం చేశారు. పలువురి ఇళ్లల్లోకి నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నవాబుపేట: మండలంలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షం రైతులకు, ప్రజలకు ఇబ్బందులతో పాటు నష్టాన్ని మిగిల్చింది. మండలంలోని గురుకుంట, కొళ్లగుట్టతండా, కొల్లూర్, పోమాల్, కామారంలో ఇటుక బట్టీలు, కాకర్లపహాడ్, రుక్కంపల్లి, కొండాపూర్, దాయపంతులపల్లిలో కూరగాయల పంటలు వర్షం, వడగండ్ల వానకు దెబ్బతిన్నాయి.


పెద్దర్‌పల్లిలో నీటమునిగిన కొత్తిమీర తోటను చూపిస్తున్న రైతు


కొత్తపేటలో కురిసిన వర్షానికి తడిసిన వరి ధాన్యం


కాకర్లపహాడ్‌లో నేల వాలిన టమాట తోట

ఆన్‌లైన్ మూల్యాంకనంపై ఆచితూచి..

- అన్ని కోణాల్లోనూ పరిశీలించిన తర్వాతే ముందుకు..
- 35 లక్షల పేపర్ల వాల్యుయేషన్‌పై నేడు ఇంటర్ బోర్డు నిర్ణయం!



సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనం (వాల్యుయేషన్)పై బోర్డు అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. భద్రత ఎంతవరకు అనే అంశం తెరపైకి రావడంతో దీనిపై ఆచితూచి అడుగేయాలని భావిస్తున్నారు. అన్ని కోణాల్లోనూ చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోనున్నారు. ఈ అంశంపై సోమవారం ఉన్నతాధికారులు భేటీ అయ్యే అవకాశం ఉంది. ఈ నెల 15 నుంచి ఇంటర్ పరీక్షలు జరుగుతున్న సంగతి తెలిసిందే. వచ్చే నెల 4వ తేదీ వరకూ ఇవి కొనసాగుతాయి. పరీక్షలు జరుగుతుండగానే పూర్తయిన పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనానికి బోర్డు ఏర్పాట్లు చేస్తుంది. ఈ ఏడాది 35 లక్షల జవాబు పత్రాలను ఆన్‌లైన్ ద్వారా మూల్యాంకనం చేయాలని నిర్ణయించారు.దీనికోసం టెండర్లు కూడా పిలిచారు. మొదటిసారి ఒకే ఒక సంస్థ ముందుకు రావడంతో టెండర్లు రద్దు చేసి రెండోసారి పిలిచారు. ఈసారి రెండు సంస్థలు ముందుకొచ్చాయి. ఎల్-1 సంస్థను సోమవారం ఖరారు చేయాలని నిర్ణయించారు.

డేటా చోరీ నేపథ్యంలో..

ప్రస్తుతం రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారం రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. కొన్ని నెలల క్రితం బోర్డులోనే డేటా ట్యాంపరింగ్ జరిగింది. ఓ వ్యక్తి అక్రమంగా కీలకమైన భద్రత డేటాను దొంగిలించినట్టు బోర్డు గుర్తించింది. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే బోర్డులోని భద్రత వ్యవస్థ చర్చనీయాంశమయ్యింది. డేటా ట్యాంపరింగ్ వ్యవహారం తర్వాత నిపుణుల చేత పూర్తిస్థాయి సాంకేతిక పరీక్షలు చేపట్టిన ఉన్నతాధికారులు.. మరింత లోతుగా విశ్లేషణ అవసరమని భావిస్తున్నారు.

అన్ని కోణాల్లో పరిశీలించాకే..

ఆన్‌లైన్ మూల్యాంకనం చేపట్టే విషయాన్ని పరిశీలిస్తున్నాం. దీనిపై ఇంకా పూర్తిస్థాయి నిర్ణయానికి రాలేదు. ఆఫ్‌లైన్‌తో పాటు పాక్షికంగా ఆన్‌లైన్లో చేపట్టే ఆలోచనపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం. టెండర్ల విషయంలో సోమవారం ఓ నిర్ణయానికి వచ్చే వీలుంది. ఏది ఏమైనా అన్ని కోణాల్లోనూ ఈ అంశాన్ని పరిశీలించిన తర్వాతే ఓ నిర్ణయానికొస్తాం.

– నవీన్ మిత్తల్, ఇంటర్ బోర్డు కార్యదర్శి

చిన్నోనిపల్లి అష్టదిగ్బంధం

'నెట్టెంపాడు' రిజర్వాయర్ భూనిర్వాసితుల గ్రామంలో 144 సెక్షన్

- నిరసన దీక్షలు చేస్తున్న నిర్వాసితులను అర్ధరాత్రి అరెస్టు చేసిన పోలీసులు
- గ్రామంలోని పురుషులందరినీ అదుపులోకి తీసుకున్న వైనం
- పనులను అడ్డుకొనేందుకు మహిళల విఫలయత్నం

గద్వాల రూరల్/గట్టు: జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం చిన్నోనిపల్లిని పోలీసులు అన్ని వైపులా చుట్టుముట్టారు. గ్రామంలో 144 సెక్షన్ విధించారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా గ్రామ సమీపంలో రిజర్వాయర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గత కొంతకాలంగా నిరసన దీక్షలు చేస్తున్న వారందరినీ శనివారం అర్ధరాత్రి మొదలు ఆదివారం తెల్లవారుజాము వరకు అరెస్టు చేశారు. గ్రామం మొత్తం జల్లెడపట్టి కనిపించిన మగవారందరినీ అదుపులోకి తీసుకున్నారు. దీంతో మహిళలు నిర్మాణ పనులను అడ్డుకొనేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు.



చిన్నోనిపల్లి రిజర్వాయర్ వద్ద మోహరించిన పోలీస్ బలగాలు

ఇప్పటికే 90 శాతం పూర్తి..

జోగుళాంబ గద్వాల జిల్లా నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా గట్టు మండలం చిన్నోనిపల్లి గ్రామ సమీపంలో 1.50 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌ను 2006లో నిర్మించేందుకు పూనుకున్నారు. మూడేళ్లపాటు నిరాటకంగా సాగిన పనులు సుమారు 90 శాతం మేర పూర్తయ్యాయి. ఈ క్రమంలో రాక్ వర్క్ పనులకు సంబంధించి బ్లాస్టింగ్ చేయగా కొన్ని మట్టి మిద్దెలు, పాత ఇళ్ల నెర్రెలు ఇచ్చి కూలిపోయాయి. బ్లాస్టింగ్ పనులను సదరు కాంట్రాక్టర్ రాత్రివేళ కొనసాగించడంతో అప్పట్లో గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. అలాగే గ్రామాన్ని ఖాళీ చేయడానికి నిరాకరించారు. దీంతో పనులు నెమ్మదించి 2009 నాటికి పూర్తిగా ఆగిపోయాయి. తాజాగా 16 ఏళ్ల తర్వాత రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి మిగిలిన 10 శాతం పనులను పోలీసు పహారా మధ్య అధికారులు ప్రారంభించారు. ఇరిగేషన్ శాఖ ఈఈ రహీముద్దీన్, ఆర్డీఓ రాములు, డీఎస్పీ రంగస్వామి పనులను దగ్గరుండి కొనసాగిస్తున్నారు.

423 రోజులుగా దీక్షలు...

పచ్చని పంటలు పండిస్తూ హాయిగా జీవిస్తున్న గ్రామస్తులకు రిజర్వాయర్ నిర్మాణం గుదిబండగా మారింది. దశాబ్దాలుగా వ్యవసాయాన్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్న భూములతోపాటు నివాసముంటున్న చిన్నోనిపల్లి గ్రామం సైతం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతుందనే విషయం తెలుసుకున్న రైతులు ఎందరు అధికారులను కలిసి రిజర్వాయర్ నిర్మించొద్దని కోరినా ఫలితం లేకపోయింది. దీంతో 'రిజర్వాయర్ రద్దు'కోసం గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. ఏకంగా 423 రోజుల పాటు దీక్షలు చేసిన నిర్వాసితులను రాత్రి రాత్రికి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే రిజర్వాయర్ కింద ఒక్క ఎకరా ఆయకట్టు లేనప్పటికీ ప్రభుత్వం రైతుల ఆవేదనను పట్టించుకోకుండా పోలీసు బలగాలతో నిర్మాణ పనులు చేపడుతుండటాన్ని విపక్షాలు తప్పుబడుతున్నాయి. అధికార బీఆర్ఎస్ మినహా బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నేతలంతా ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించారు. రైతులకు జరిగే అన్యాయాన్ని అడ్డుకుంటామని, మరో ఉద్యమానికి సిద్ధమవుతామని ప్రకటించారు.

మళ్లీ జీవీకే చేతికి '108'

- 102, 104 సేవలు కూడా ఆ సంస్థకే అప్పగింత
- ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి పేదల శవాల తరలింపు కూడా..
- మండలానికో అంబులెన్స్ ఇవ్వాలని కీలక నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: ప్రజలకు అత్యవసర వైద్య సేవలందించే '108'వాహన టెండర్‌ను మళ్లీ జీవీకే సంస్థే దక్కించుకుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో జీవీకేతోపాటు మరో కంపెనీ పాల్గొంది. చివరకు జీవీకే సంస్థకే టెండర్ దక్కినట్లు వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. దీంతోపాటు ఈసారి 102 అమ్మ ఒడి, 104, ప్రభుత్వ ఆసుపత్రులనుంచి పేదల శవాలను వారి సొంతూళ్లకు ఉచితంగా తరలించేందుకు ఏర్పాటు చేసిన వాహనాల బాధ్యత కూడా జీవీకేకే అప్పగించారు. ప్రస్తుతం 50 వాహనాలు పేదల శవాలను ఆసుపత్రుల నుంచి సొంతూళ్లకు ఉచితంగా తీసుకెళ్తున్నాయి. ఈ నాలుగు సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి ఆ సంస్థకు బాధ్యతలు అప్పగించారు.

ప్రస్తుతం 358 వాహనాలు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో '108'అత్యవసర అంబులెన్స్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో అకస్మాత్తుగా వైద్యం అవసరమైన వారు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు '108'నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా ఈ అంబులెన్స్ సేవలను ఉచితంగా పొందుతున్నారు. ప్రస్తుతం 358 వాహనాలు '108'అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నాయి. వాటిల్లో 333 రోడ్లపై అందుబాటులో ఉండగా, మిగిలిన వాటిని రిజర్వులో ఉంచారు. అప్పట్లో కొన్ని వాహనాలు చెడిపోగా, వాటి స్థానంలో కొన్ని వాహనాలను గిఫ్ట్ ఎ స్మైల్ కింద రాజకీయ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు తదితరులు ఉచితంగా ఇచ్చారు. ప్రస్తుతం లక్ష మంది జనాభాకు ఒకటి చొప్పున '108'వాహనం ఉందని అధికారులు చెప్తున్నారు. ఫోన్ చేసిన దాదాపు 20 నిమిషాల్లో అంబులెన్స్ బాధితుల వద్దకు చేరుకోవాలనేది నిబంధన. ఈ అంబులెన్స్ సర్వీసులను ప్రస్తుతం కూడా జీవీకే సంస్థనే నిర్వహిస్తోంది. ఇప్పటివరకు 108 వాహనాల నిర్వహణకోసం ప్రభుత్వం ఏడాదికి రూ. 86 కోట్ల మేర ఖర్చు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. కాగా, ఈసారి ఎంతకు ఖరారు చేశారన్న దానిపై స్పష్టత లేదు.

పలు మార్పులకు శ్రీకారం..

ప్రస్తుతమున్న '108'అంబులెన్స్ సేవల్లో పలు మార్పులు చేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు జీవీకే సంస్థ ఏర్పాట్లు చేసే అవకాశముంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేట్ ఆఫ్ ఆర్ట్ కాల్ సెంటర్‌కు రూపకల్పన చేస్తారు. దాని ద్వారా కంప్యూటర్ ఆధారంగా అంబులెన్సులను ఆటోమాటిక్‌గా నడిపిస్తారు. ఆటోమాటిక్ కాల్ డిస్ట్రిబ్యూటర్ (ఏసీడీ) వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. కంప్యూటర్ టెలిఫోనీ ఇంటర్‌ఫేస్ (సీటీఐ), వాయిస్ లాగింగ్ కేపబిలిటీస్, జీపీఎస్ ఇంటిగ్రేషన్, హైలీ సెక్యూర్డ్ నెట్‌వర్క్‌లను రూపొందిస్తారు. ఈ వ్యవస్థ ప్రస్తుతానికే కాకుండా భవిష్యత్ అవసరాలకు కూడా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. అంతేకాక దీనిని విపత్తు నిర్వహణ విభాగానికి అనుసంధానం చేస్తారు. ఇది పోలీస్, ఫైర్ సర్వీసులతోనూ అనుసంధానం అవుతుంది. అన్ని '108'అంబులెన్స్‌లకు జీపీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. అలాగే ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. బాధితుడిని తీసుకెళ్లే ఆసుపత్రికి ముందస్తు సమాచారం ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తారు. అన్ని కార్పొరేట్ కంపెనీల్లోనూ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా ఉంది.

మండలానికో '108'వాహనం..

ఇకపై ప్రతీ మండలానికి ఒక '108'వాహనాన్ని సమకూర్చాలని సర్కారు యోచిస్తోంది. తద్వారా దాని పరిధిలోని సమీప గ్రామాలకు తక్కువ సమయంలో చేరుకోవడానికి వీలు కలుగుతుందని, అనేకమందిని ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చనేది ప్రభుత్వ ఆలోచన. ప్రస్తుతం లక్ష మంది జనాభాకు ఒకటి చొప్పున '108'వాహనం ఉండగా, మండలానికి ఒకటి కేటాయించడం ద్వారా ప్రతీ 70 వేల జనాభాకు ఒకటి అందుబాటులోకి తీసుకురావాలని అనుకుంటున్నారు.

రణరంగంగా మోతె

- భూ వివాదంతో ఉద్రిక్తత
- రెండు వర్గాల ఘర్షణ

వేల్పూర్: వేల్పూర్ మండలం మోతె గ్రామంలోని 333 సర్వే నంబరు భూమిపై ఎస్సీలు, గ్రామస్తుల మధ్య చాలా ఏళ్లుగా కొనసాగుతున్న భూ వివాదం ఆదివారం ఘర్షణకు దారితీసింది. మోతె రాజరాజేశ్వరస్వామి ఆలయానికి సమీపంలోని 333 సర్వేనంబరులోని సుమారు ఎకరంన్నర భూమి రికార్డుల పరంగా మొదటినుంచి తమదేనని ఎస్సీలు ఇస్సాపల్లి నడ్పిగంగారం, రవి, ప్రతాప్ పేర్కొంటున్నారు. ఈ భూమిని పూర్వకాలంలో ఎస్సీలు రాజరాజేశ్వరస్వామి ఆలయానికి ఇచ్చారని, యేటా జాతరకు ఈ భూమిని ఉపయో గించుకుంటామని గ్రామస్తులు వాదిస్తున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య చాలా ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. గతంలో ఎస్సీలు భూమిని దున్ని పంట వేయగా గ్రామస్తులు తొలగించారు. గతేడాది గ్రామస్తులు ఆ భూమిలో విగ్రహాలు ఏర్పాటు చేయగా ఎస్సీలు తొలగించారు. ఎస్సీలు ఆ భూమికి ఇటీవల కంచె ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వీడీసీ ఆధ్వర్యంలో ఇంటికొకరు చొప్పున రాజరాజేశ్వర ఆలయానికి చేరుకొని సమావేశమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సీలు తమ అనుచరులు, బంధువులు, దళిత సంఘాల నేతలతో కలిసి భూమి వద్దకు చేరుకున్నారు. ఎస్సీలు ఏర్పాటు చేసిన కంచెను, జెండాలను గ్రామస్తులు తొలగించారు. అడ్డు వచ్చిన వారిపై దాడికి పాల్పడ్డారు. అదే సమయంలో భీమ్‌గల్ వైపు వెళ్తున్న బాల్కొండ నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు.. ఘర్షణను చిత్రీకరిస్తుండగా వారిపై దాడికి పాల్పడి పరికరాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్ రెడ్డి, వేల్పూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వారిని చెదర గొట్టారు. ఎస్సీ వర్గీయులు తమపై దాడికి పాల్పడిన గ్రామస్తులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఎస్సీలు ఏర్పాటు చేసిన కంచె, జెండాలను తొలగిస్తున్న గ్రామస్తులు

ఎమ్మెల్యే గణేశ్ గుప్తాకు తప్పిన ప్రమాదం

కామారెడ్డి టౌన్: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తాకు పెను ప్రమాదం తప్పింది. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఎమ్మెల్యే కాన్వాయ్ మధ్యకు ఓ ప్రైవేటు వాహనం రావడంతో ప్రమాదం జరిగింది. కాన్వాయ్ కామారెడ్డి పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులో జాతీయ రహదారి ఫ్లై ఓవర్ వద్దకు రాగానే.. ఢిల్లీ నుంచి కేరళ వైపు వెళ్తున్న వాహనం ఎమ్మెల్యే వాహనం వెనక్కు వచ్చింది. ఆ కారు వేగం నెమ్మదించడంతో వెనకాల ఉన్న ఎమ్మెల్యే కాన్వాయ్ వాహనం ఢిల్లీ కారును ఢీకొనగా.. అది ఎమ్మెల్యే కారును ఢీకొట్టింది. ఇలా నాలుగు కార్లు ఒకదాని నొకటి ఢీకొన్నాయి. వెంటనే వాహనాల్లోని ఎయిర్ బ్యాగులు తెరుచుకున్నాయి. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. నాలుగు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఎవరికీ గా యాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా వాహనం

బిడ్డ పుట్టినరోజే.. నాన్న ఆత్మహత్య

ఉండవెల్లి: కొడుకు జన్మించిన రోజే ఓ తండ్రి బలవన్మర ణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకర ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లిలో చోటు చేసుకుంది. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న రాజు (29)కు కొన్నేళ్ల క్రితం గీతతో వివాహమైంది. వారిద్దరికి పాప, కుమారుడు ఉండగా.. ఆదివారం మూడో సంతానంగా మగ బిడ్డ అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో జన్మించాడు. కుమారుడిని చూసి వచ్చిన రాజు.. మధ్యాహ్నం వేళ ఇంట్లోనే ఉరివేసు కుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆత్మ హత్యకు గల కారణాలు తెలియడం లేదని అతని తల్లిదండ్రులు, స్థానికులు చెబుతు న్నారు.



రాజు (ఫైల్)

సిట్టింగ్ జడ్జితో విచారించాలి

జడ్చర్ల టౌన్: ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారించాలని బీసీ సేన కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎమ్మార్పీ కార్యాలయం వద్ద మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ టీఎస్‌పీఎస్సీ కార్యాలయం నుంచే అయినందున చైర్మన్ జనార్దన్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలన్నారు. లక్షలాది నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలకోసం వేచి చూస్తూ అహర్నిశలు కష్టపడి చదివిన వారు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో నిరంజన్, శేఖర్, మురళి, చంద్రమౌళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

1,021 అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం 1,021 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా నీటిని నిలిపివేశారు. సమాంతర కాల్వ ద్వారా 97 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 50 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.

ఏడాదిలోనే రెండు ఉద్యోగాలు



భాస్కర్

బల్మూర్: ఏడాదిలోనే రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తుల మన్ననాలు పొందాడు. మండలంలోని నర్సాయపల్లికి చెందిన కేతావత్ లక్ష్మణ్, శాంతి రెండవ కుమారుడు కేతావాత్ భాస్కర్ తండ్రి అనారోగ్యంతో తన చిన్న వయసులోనే మృతి చెందగా, కుటుంబం ఆర్థిక సంక్షోభంలో మునిగిపోవడంతో చదువు ఆపాల్సిన పరిస్థితి ఏర్పడింది. కుటుంబ పెద్దదిక్కు అయిన అన్న కృష్ణ హైదారాబాద్ వలస వెళ్లి కూలీ పనులు చేస్తు తమ్ముడు భాస్కర్‌ను కర్నూల్ జిల్లా నంద్యాలలో బ్యాంకు కోచింగ్‌కు పంపించాడు. ఆరు నెలల కిత్రం ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో ఉద్యోగం సాధించి ప్రస్తుతం ఛత్తీస్‌ఘడ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అక్కడ ఉద్యోగం చేస్తునే గత నెలలో ఎస్‌బీఐలో ఉద్యోగం కోసం పరీక్షలు రాయగా, ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఉద్యోగం సాధించాడు. ఒకే ఏడాది వ్యవధిలో రెండు ఉద్యోగాలు సాధించడంతో వారి కుటుంబ సభ్యుల ఆశయాన్ని నిలబెట్టాడని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

రాష్ట్రంలో కుటుంబపాలన

- ప్రభుత్వాలపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు
- గోవా పీసీసీ మాజీ అధ్యక్షుడు గిరీష్ చొడాంకర్

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో కుటుంబపాలన కొనసాగుతున్నదని గోవా మాజీ పీసీసీ అధ్యక్షుడు, హాథ్‌సే హాథ్ జోడో రాష్ట్ర ఇన్‌చార్జ్ గిరీష్ చొడాంకర్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలప్పుడు దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని చెప్పి మాట మార్చినట్లు ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై రోజు రోజుకు ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని పీఎం నరేంద్రమోదీ, ప్రతి ఇంటికి ఉద్యోగం ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేసినట్లు విమర్శించారు. ఢిల్లీలోని పెద్ద మోదీ, తెలంగాణలోని చిన్న మోదీ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాల్లో చేపడుతున్న హాథ్‌సే హాథ్ జోడో యాత్ర ద్వారా ప్రజలతో మమేకమవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో ప్రదీప్‌గౌడ్, వినోద్‌కుమార్, సంజీవ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న గిరీష్ చొడాంకర్

సమస్యలు తెలుసుకునేందుకే జోడోయాత్ర

భూత్పూర్: దేశంలో పేద ప్రజల కష్ట సుఖాలు, సమస్యలు తెలుసుకోవడానికే రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేసినట్లు హాథ్ సే హాథ్ జోడో యాత్ర రాష్ట్ర ఇన్‌చార్జ్ గిరీష్ చొడాంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని పోతులమడుగులో నిర్వహించిన హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా డీసీసీ అధ్యక్షుడు మధుసుదన్‌రెడ్డి, పీసీసీ సంయుక్త కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రావు, సంజీవ్‌తో కలిసి ఇంటింటా తిరిగి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ చేపట్టే కార్యక్రమాలను వివరించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీల కోసం దేశ సంపదను దోచిపెడుతుందని ఆరోపించారు. ప్రధాన మంత్రి మోదీ నల్లధనం వెలిక్కి తెచ్చి దేశ ప్రజలకు రూ.15లక్షల బ్యాంకు అకౌంట్‌లో జమ చేస్తామని, 10కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారన్నారు. సీఎం కేసీఆర్ ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తానని, తమకు పదవులు అవసరం లేదని, ప్రత్యేక రాష్ట్రం కావాలని నేడు వాళ్ల కుటుంబాలకే ఉద్యోగాలు తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పేద ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. ప్రజల మీద నిత్యావసర ధరలు విపరీతంగా పెంచడంతో సామాన్య ప్రజల బతుకులు కష్టంగా మారిందని, వేల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం టీఎస్‌పీఎస్ పరీక్షలన్నీ రద్దు చేయాలని పోతులమడుగులో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనంచేశారు. కార్యక్రమంలో వసంత, మహ్మద్ సాధిక్, రాధాకృష్ణారెడ్డి,బాసిత్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తీరు మార్చుకోవాలి



అమ్రాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

మన్ననూర్: నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే ఫ్రెండ్లీ పోలీస్ పరిమితమైందని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ ఆరోపించారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి నిఖిత హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు పోలీసులు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ అమ్రాబాద్ పోలీస్ స్టేషన్ ముందు రేణయ్య అధ్యక్షతన అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆదేశాలతోనే పోలీసులు ఐపీసీ సెక్షన్‌ను అబాసుపాలు చేస్తూ అమలు చేస్తుండటం దురదృష్టకరమన్నారు. పోలీసులు అంటే ప్రజల్లో గౌరవం ఏమాత్రం లేదన్నారు. మందకృష్ణ మాదిగ విచారణ తర్వాత బాధితుల తరుపున అఖిలపక్ష చేసిన డిమాండ్స్ ఏ ఒక్కదానికి ఇప్పటి వరకు రూపం లేదన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ, ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఏ ఒక్కదానికి అతీగతి లేదన్నారు. సంఘటన రోజు ఎస్ఎస్‌యూఐ నాయకులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం ఎమ్మెల్యే వద్ద పోలీసుల గులాంగిరికి నిదర్శనమన్నారు. గువ్వల బాలరాజు చేసే అరాచకాలపై చార్జిషీట్ వేసి రౌడీషీట్ తెరవాలని, అందుకు కావాల్సిన ఆధారాలు ఇస్తానన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చౌట కాశీం మాట్లాడుతూ అఖిల పక్షం చేసిన ఉద్యమాలకు దిగివచ్చిన ప్రభుత్వం రీ పోస్టుమార్టం చేసేందుకు ముందుకు వచ్చిందని గుర్తు చేశారు. అదే క్రమంలో నిఖిత కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేంత వరకు ఉద్యమాన్ని విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు శ్రీనివాసులు, లింగమ్మ, ప్రణిత, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, దశరథం, ప్రవీణ్‌కుమార్, మహేష్, అచ్చిరెడ్డి, కాశన్నయాదవ్, ఎల్లస్వామి, రామనాథం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సత్యాహరిశ్చంద్ర స్ఫూర్తి నాటకం



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మానంద సంగీత నాటక అకాడమీ భూత్పూర్ వారి ఆధ్వర్యంలో శనివారం రాత్రి సత్యాహరిశ్చంద్ర స్ఫూర్తి నాటకం, కృష్ణార్జుని యుద్ధ ఘట్టం నాటక ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంగీత దర్శకుడు ఎస్.తిరుపతయ్య సారథ్యంలో పాత్రధారులు చక్కటి అభినయంతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాకారులు హస్నాపూర్ మాజీ సర్పంచ్ ఎం.కొండయ్య, ఎస్.కృష్ణయ్య, పట్నం రాములు, ఎస్.గాల్‌రెడ్డి, మన్యంకొండయ్య, అయోధ్య, రామకృష్ణారెడ్డి, జి.శ్రీనివాసరావు, సి.సాయిలు, భాస్కరాచారి, చక్రధరచారి, బోరింగ్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల్లోనే మినీ శిల్పారామం పూర్తి

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని పెద్దచెరువు ప్రాంతం గతంలో దుర్గంధభరితంగా ఉండేదని, ఇప్పుడు నందనవనంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఎండీ మనోహర్‌తో కలిసి ఆయన మినీ ట్యాంక్‌బండ్, మినీ శిల్పారామం, నెక్లెస్ రోడ్డు, ఐలాండ్ పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రెండు, మూడు నెలల్లోనే ఈ పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఇక్కడ తీగల వంతెనతో పాటు పట్టణవాసుల కోసం 4 కి.మీ. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేసీఆర్ ఎకో పార్కు, మన్యంకొండ దేవాలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి పరుస్తామన్నారు. దివిటిపల్లిలోని ఐటీ పార్కులో లిథియం బ్యాటరీ అమరరాజా కంపెనీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. విదేశాల్లో స్థిరపడిన జిల్లాకు చెందిన ఎన్ఆర్ఐలు కొందరు ఇక్కడ స్టార్టప్‌లు ఏర్పాటుచేసే ఆలోచనలో ఉన్నారన్నారు. కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్లు పూర్తయితే జిల్లాలో పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. రామన్‌పాడు పైప్‌లైన్ ద్వారా అబ్దుల్ ఖాదర్ దర్గా మీదుగా, బస్ డిపో వెనుక నుంచి ట్యాంక్‌బండ్‌లోకి నీటిని వదిలే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌కు మంత్రి సూచించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ గంజి వెంకన్న, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ మనోహర్, కౌన్సిలర్ రామ్‌లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మినీ శిల్పారామంలో పనులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు

ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: కాంగ్రెస్ పార్టీ నాయకులు తనపై అభండాలు మోపుతూ దాడులకు పాల్పడుతున్నారని, తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉనికి కోల్పోతున్నామని మూడు సంవత్సరాల నుంచి కుట్రలు చేస్తూ, తనను స్వయంగా ఎదుర్కోలేక దాడులకు పురిగొల్పుతున్నారని ఆరోపించారు. శనివారం మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ స్వగ్రామమైన అమ్రాబాద్ మండలం ఎలమపల్లిలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో స్వచ్ఛందంగా చేరారని, జీర్ణించుకోలేక అక్కడి కార్యకర్తలను రెచ్చగొట్టి, మద్యం తాపించి దాడికి యత్నించారన్నారు. తమ పార్టీ జెండాలు, దిమ్మెలను కూల్చారని, ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు రియల్ ఎస్టేట్ దందాలు, భూ కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. యురేనియం, పునరావాసం అంటూ అభూతకల్పనలు చేస్తూ అమాయక ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఉప్పునుంతల మండలంలో ఓ కాంగ్రెస్ నాయకుడు భూ కబ్జాలు చేస్తూ దళితుల చేత చెప్పు దెబ్బలు తిన్నాడన్నారు. మరో నియోజకవర్గ నాయకుడు ఆరోగ్యం పేరుతో దందాలు చేస్తున్నారని, ఇలాంటి నాయకులు అవసరమా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా గెలవాలే తప్పా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడవద్దన్నారు. మన్ననూర్‌లో చనిపోయిన నిఖిత మరణాన్ని రాజకీయం చేయడం సరైంది కాదన్నారు. అమ్రాబాద్ పోలీసులను భయభ్రాంతులకు గురి చేస్తూ పోలీస్‌స్టేషన్ ఎదుటనే రాస్తారోకోలు చేయడమేంటన్నారు. హింసలు, దాడులపై ప్రభుత్వం, డీజీపీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో మనోహర్, నర్సింహగౌడ్, తులసీరాం, రాజేశ్వర్‌రెడ్డి, అరుణ, రాంబాబునాయక్, అమీనోద్దీన్, శ్రీధర్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల కోసమే రిజర్వాయర్ పనులు

గద్వాల రూరల్: రైతులకు చిల్లిగవ్వంత కూడా మేలు చేయని చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులను ప్రభుత్వం కాంట్రాక్టర్ల లాభం కోసమే ప్రారంభించిందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఒక ప్రకటనలో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సుమారు 423 రోజుల పాటు నిరసన దీక్షలు చేపడుతున్న నిర్వాసిత రైతుల గోడును పట్టించుకోకుండా పోలీసు బలగాలతో నిర్బంధించి రిజర్వాయర్ పనులను చేపట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. నిర్వాసిత రైతుల న్యాయమైన డిమాండును ప్రభుత్వం ఆమోదించి తక్షణమే చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను రద్దు చేయాలని డిమాండు చేశారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు వారి తరపున పోరాటం చేస్తామన్నారు.